క్లుప్తంగా

నేడు 'స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్'

పలమనేరు: పట్టణంలోని దినసరి కూరగాయల మార్కెట్‌లో శనివారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, వైస్ చైర్మెన్లు, కౌన్సిలర్లు, ఎన్‌జీవోలు హాజరుకానున్నట్లు తెలిపారు.

సమస్యలపై తక్షణమే స్పందించాలి



మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

రామకుప్పం: రెవెన్యూ సమస్యలపై తక్షణమే స్పందించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. భూసర్వే పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైన గిడ్డపల్లి గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. అనంతరం రామకుప్పం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ గదిలో వీఆర్‌ఓ, సర్వేయర్ల సమావేశంలో పాల్గొన్నారు. భూసర్వే విషయంలో ఎటువంటి ఫిర్యాదులు, ఆరోపణలు రాకుండా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రెవెన్యూ సమస్యల్లో వచ్చిన సమస్యలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. భూసర్వే పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందిని కోరారు. సమావేశంలో కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు, తహసీల్దార్ బాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

19న ఉచిత వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని వారాహి గ్రూపు ఆధ్వర్యంలో ఈనెల 19న వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు హేమంత్‌రాయల్ తెలిపారు. బెంగళూరుకు చెందిన వైదేహి ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్, గుండె, కిడ్నీ తదితర వ్యాధులకు సంబంధించి లీనార్డ్ హైస్కూల్‌లో ఉదయం 9 నుంచి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డుతో వచ్చి ఉచిత వైద్యసేవలు పొందాలని కోరారు.

రేపు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

సదుం: మండలంలోని రామాపురంలో ఈనెల 19న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డితో పాటు పలువురు హాజరు కానున్నట్లు చెప్పారు.

వైద్య పరీక్షలు

పెద్దపంజాణి: గ్రామీణ ప్రాంత ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మురళి తెలిపారు. మండలంలోని ఓబులాపురంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ భవాని, ఆశా కార్యకర్తలు రేణుక, గాయత్రి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ బాలాజీ

పెద్దపంజాణి: గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ బాలాజీ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది, సీసీలతో సమీక్ష నిర్వహించారు. వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న 381 ఇళ్లను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ బాలచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, ఏపీఓ మురుగేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై అట్రాసిటీ కేసు

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణతో పాటు నలుగురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయినట్లు రామకుప్పం పోలీసులు తెలిపారు. గురువారం 89 పెద్దూరు గ్రామంలో పశువుల పండుగ నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన సెల్వం వేడుక చూసేందుకు వచ్చారు. ఎంపీటీసీ సభ్యుడు వెంకట రమణ, చరణ్‌తేజ, ప్రకాష్, వేలు, నారాయణ కులం పేరుతో తనను దూషించినట్లు సెల్వం రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెల్వం ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

- క్రీడల్లో రాణిస్తున్న చందం పాఠశాల విద్యార్థులు
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా
- దాతలు సహకరిస్తే మరింత రాణిస్తామంటున్న విద్యార్థులు
- క్రీడాకారుల ప్రతిభకు మెరుగులు దిద్దుతున్న పీడీ లోకనాథం

ఆటల్లో అదుర్స్



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న పీడీ లోకనాథం

అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని గ్రామీణ ప్రాంతమైన కుప్పం మండలం చందం ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో జాతీయ , రాష్ట్ర స్థాయిలో రాణించి పతకాలు సాధిస్తున్నారు. పీడీ లోకనాథం ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు. దాతలు సహకరిస్తే అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతామని చెబుతున్నారు.

–కుప్పం రూరల్

కుప్పం మండలం చందం ఉన్నత పాఠశాలలో 338 మంది అభ్యసిస్తున్నారు. ఇందులో వందకు పైగా విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే ఓ విద్యార్థి జాతీయ స్థాయికి మరో ఎనిమిది మంది రాష్ట్ర స్థాయికి ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించారు. భానుతేజ షూటింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటారు. శకుంతల, మోక్షిత్, పవన్ , జయశ్రీ షూటింగ్ బాల్, రమ్య, రంజిత నెట్‌బాల్, హరిత, ఝాన్సీ యోగా రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించారు.

క్రీడలపై మక్కువ

చందం ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడలంటే మక్కువ చూపుతున్నారు. ముఖ్యంగా కబడ్డీ. షూటింగ్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బేస్‌బాల్, నెట్‌బాల్, త్రోబాల్, యోగాలో విశేషంగా రాణిస్తున్నారు. ఉదయం పాఠశాల ప్రారంభానికి ముందు గంట, సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత సాధన చేస్తుంటారు. క్రీడా మైదానం లేకపోయినా సర్పంచ్ కుమారస్వామి చదును చేసి ఇచ్చిన ప్రైవేట్ స్థలంలోనే సాధన చేస్తూ రాణించడం గమనార్హం.

లోకనాథం ఆధ్వర్యంలో శిక్షణ

పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న లోకనాథం స్వతాగా క్రీడాకారుడు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించారు. తనకు తెలిసిన క్రీడలను పిల్లలకు నేర్పుతూ ఆనందం పొందుతున్నారు. అక్కడితో ఆగకుండా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణించేలా చొరవ చూపుతున్నారు. 9 మంది విద్యార్థులు ఈ ఏడాది జాతీయ , రాష్ట్ర స్థాయిలో రాణించారంటే అతని కృషి అని చెప్పక తప్పదు.



యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయ బృందం

దేశానికి ఆడాలని ఉంది



ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌లో షూటింగ్‌లో పాల్గొన్నా. రాష్ట్ర స్థాయిలో పతకం సాధించా. ప్రభుత్వం , దాతలు ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ఆడాలని ఉంది. జాతీయ స్థాయిలో రాణించడానికి పీడీ లోకనాథం సహాయ సహకారాలు అందించారు.

–భానుతేజ, విద్యార్థి, చందం ఉన్నత పాఠశాల

దాతలు సహకరిస్తే



దాతలు ముందుకొచ్చి సహకరిస్తే విద్యార్థులు మరికొంత మంది జాతీయ స్థాయికి ఆడగలరు. రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లి ఆడించాలన్నా, వారికి శిక్షణ ఇవ్వాలన్నా ఖర్చుతో కూడుకున్న విషయం. కొన్నిసార్లు ప్రతిభ ఉన్నా, క్రీడా సామగ్రి లేక ఆర్థిక సమస్యలతో వెనుకబడిపోతున్నాం. దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే మరింతగా రాణిస్తారు.

–లోకనాథం, ఫిజికల్ డైరెక్టర్, చందం

ఆనందంగా ఉంది



గ్రామీణ ప్రాంతంలోని చందం పాఠశాల విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయి పతకాలు సాధించడం ఆనందంగా ఉంది. ఈ విద్యా సంవత్సరంలో 9 మంది పతకాలు సాధించారు. మరింత మందిని జాతీయ స్థాయికి పంపాలన్నదే లక్ష్యం. తల్లిదండ్రులు మంచి సహకారం అందిస్తున్నారు. బాలికలు అయితే బాలురతో పోటీ పడి మరీ పతకాలు సాధించడం శుభపరిణామం.

–మార్కొండనాయుడు, ప్రధానోపాధ్యాయుడు, చందం

మూడు కేంద్రాల్లో నవోదయ పరీక్ష

పుంగనూరు: పట్టణంలోని మూడు ప్రాంతాల్లో శనివారం నవోదయ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని బసవరాజ ప్రభుత్వ హైస్కూల్, జెడ్పీబాలికల హైస్కూల్, కొత్తయిండ్లు మున్సిపల్ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 588 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉందన్నారు. విద్యార్థులు 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఈ మేరకు పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

కుటుంబ కలహాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: మండలంలోని రెండు గ్రామాల్లో వేరు వేరు కుటుంబాలకు చెందిన ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని ఈడిగపల్లె వద్ద గల యాతాలవంకకు చెందిన ధనుష్(23) కుటుంబ సమస్యలతో గురువారం రాత్రి విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అలాగే మండలంలోని జెట్టిగుండ్లపల్లె గ్రామానికి చెందిన పోతన్న(30) కుటుంబ కలహాలతో జిల్లెడుపాలు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇరువురిని కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇరువురు చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం



దేవేంద్రరెడ్డి (ఫైల్)

సదుం: మండలంలోని తాటిగుంటపాలెం పంచాయతీ చింతలవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవేంద్రరెడ్డి(51) పూతలపట్టు మండల పరిధిలో మృతి చెందారు. ఆయన మృతికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ధనుంజయ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహానికి శనివారం సాయంత్రం 4 గంటలకు స్వగ్రామంలో అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు.

రాహుకాల పూజలు



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తి శ్రద్ధలతో రాహుకాల పూజలు చేశారు. రాహుకాల సమయం 10:30 గంటల నుంచి 12:00 గంటల వరకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలు, రకరకాల పూలతో అలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా వసతులు కల్పించారు.



ఆలయంలో భక్తుల రద్దీ, (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఏకసభ్య కమిషన్ విజయవంతం చేద్దాం



సంఘీభావం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

పలమనేరు: ఎస్సీ వర్గీకరణపై విచారణకు ఈనెల 21న చిత్తూరుకు వస్తున్న రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి మురళి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద శుక్రవారం స్థానిక నేతలతో కలసి సమావేశాన్ని నిర్వహించారు. మందకృష్ణ మాదిగ ప్రయత్నంతోనే కమిషన్ విచారణకు వస్తోందన్నారు. కచ్చితంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలనే అంశాన్ని కమిటీ ముందు విన్నవించాలన్నారు. సమావేశంలో స్థానిక సంఘ నాయకులు ప్రకాష్, హరికృష్ణ, జగన్నాద్, మణి, వినోద్, బాబు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



కుప్పనపల్లెలో నిరసన తెలుపుతున్న మహిళలు

బైరెడ్డిపల్లె: గుక్కెడు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని కుప్పనపల్లె ఎస్సీ కాలనీ మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. కుప్పనపల్లె ఎస్సీ కాలనీలో సుమారు 90 గృహాలు ఉన్నాయన్నారు. కాలనీకి చేతి పంపు ఏర్పాటు చేయడంతో అందులో నీరు పట్టుకునేవారమన్నారు. అయితే 6 నెలల కిందట విద్యుత్ బోరు మోటారు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పి ఉన్న చేతి పంపును తొలగించారన్నారు. ఇప్పటి వరకు బోరు మోటారు ఏర్పాటు చేయకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని వాపోయారు. గతంలో ఉన్న చేతిపంపునైనా వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. తాగునీటి సమస్య పరిష్కరించకపోతే మండల కేంద్రంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ప్రియుడి మోజుతోనే భర్త హత్య ?



మూడు రోజుల కిందట హత్యకు గురైన శివకుమార్

పలమనేరు: మండలంలోని ముసలిమొడుగు గ్రామానికి చెందిన దళితనేత శివకుమార్ (42) మూడు రోజుల కిందట పట్టణ సమీపంలోని పెట్రోలు బంకు వెనుక వైపు దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే స్థానిక పోలీసులు పూర్తిగా కూపీ లాగినట్లు తెలిసింది. వేలూరుకు చెందిన మహిళతో శివకుమార్‌కు వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఈ నేపథ్యంలో శివకుమార్ తన భార్యను పట్టణంలోని చార్మినార్ హోటల్‌లో పనికి పెట్టాడు. ఆ హోటల్ యజమాని షామీర్‌తో హతుడి భార్య వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. పిల్లలను పుట్టింటిలో వదిలి కొన్నాళ్లుగా శివకుమార్ భార్య ప్రియుడితో వెళ్లి రహస్యంగా కాపురం పెట్టినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఎలాగైనా భర్తను అడ్డు తొలగించుకోవాలని ప్రియుడితో కలిసి ఈ హత్యకు స్వయాన భార్యే ప్లాన్ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తన భర్తను అంతమొందించాలంటూ ప్రియుడితో మాట్లాడిన ఆడియో రికార్డింగ్ సైతం ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికే ఈ హత్యకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసులు సేకరించినట్లు సమాచారం. నేడో రేపో నిందితుడిని పట్టుకొని పోలీసులు అరెస్ట్ చూపే అవకాశం ఉంది.

ఆడవే మయూరీ

- జనవాసాల్లోకి నెమలి



జగమర్ల- దేవలంపెంట రోడ్డు పక్కన నెమలి సోయగం

పలమనేరు: జగమర్ల సమీపంలో పలు నెమళ్లు శుక్రవారం పురివిప్పి నాట్యమాడాయి.ఈ సోయగాలను కొందరు సెల్‌ఫోన్లలో బంధించారు. సాయంత్రం వేళలో నెమళ్లు అడవిని దాటి వచ్చి జనానికి కనిపిస్తూ కనువిందు చేస్తున్నాయి. ఈ కౌండిన్య అభయారణ్యంలో నెమళ్ల సంతతి పదేళ్లలో పెరిగినట్లు అటవీ సమీప గ్రామస్థులు చెబుతున్నారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ సమావేశం



సమావేశమైన ఏపీడబ్ల్యూజేఎఫ్ బృంద సభ్యులు

పుంగనూరు: నియోజకవర్గ ఏపీడబ్ల్యూజేఎఫ్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. సంఘం నాయకులు జయరాజ్, మురళీ, సలీం, ముత్యాలు, రామనాథ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మురళీ, ఉపాధ్యక్షుడుగా రెడ్డెప్ప, గిరీష్‌కర్నాడ్, కృష్ణమూర్తి, నూరేషా, ఎం.కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులు హిదయతుల్లా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామారావు, సహాయ కార్యదర్శులుగా నాగరాజు, లక్ష్మీనారాయణ, ఎం.బాబు, లక్ష్మీప్రసాద్, గుర్రప్పచౌదరి, భానుప్రకాష్, టి.శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

శ్మశానాల్లో కబ్జా భూతాలు

- ఆఖరి మజిలీకి అగచాట్లు
- వాగులు, వంకల్లోనే అంత్యక్రియలు
- అవస్థలు పడుతున్న జనం





పలమనేరు : ఎగువ కల్లాడు వద్ద వ్యవసాయ బావి పక్కనే సమాధులు, (ఇన్‌సెట్) దేవలంపెంట వాసులకు అడవే శ్మశానం

ఆఖరి మజిలీకి వేదికైన శ్మశానాలను సైతం కొందరు రాబందుల్లా మింగేశారు. పలమనేరు నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు అసలు శ్మశానాలే లేవు. దీంతో విధి లేక చెరువులు, వాగులు, వంకలు, సొంత స్థలాల్లోనే శవాలను పూడ్చిపెట్టాల్సి వస్తోంది. ఎన్నో ఏళ్లుగా శ్మశానాలు కబ్జాకు గురవుతున్నా అధికారులు మౌనంగా ఉండిపోతున్నారు. ఫలితంగా ఆక్రమణలు విచ్చలవిడిగా సాగుతున్నాయి.

–పలమనేరు

నియోజకవర్గంలో 90 పంచాయతీలు ఉండగా వాటిలో 520 దాకా గ్రామాలున్నాయి. వీటిలో 210 గ్రామాలకు నేటికీ శ్మశాన వాటికలకు స్థలాలు లేవు. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఉంటుంది. 79 గ్రామాల్లో కబ్జాకు గురయ్యాయి. నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో కలిపి 368 ఎకరాలు శ్మశానాల కోసం ఉన్నట్లు రెవెన్యూ లెక్కలు చెబుతున్నాయి. వాస్తవంగా అయితే ఇందులో 200 ఎకరాలు కబ్జాకు గురైనట్లు తెలుస్తోంది.

మున్సిపాలిటీలో పరిస్థితి ఇలా..

పలమనేరు మున్సిపాలిటీలోని శ్మశానాలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఇప్పటికే పలుచోట్ల శ్మశాన స్థలాల్లో పక్కా భవనాలు వెలిశాయి. ప్రస్తుతం పట్టణ జనాభా 80 వేలు దాటింది. అయితే పెరిగిన జనాభాకు అనుగుణంగా తగినంత శ్మశాన స్థలాలు లేవు. ఎవరైనా మృతి చెందితే ఎక్కడికి తీసుకెళ్లాలో శ్మశానం ఎక్కడుందో వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. పట్టణంలో శ్మశానాలకు సంబంధించి ప్రభుత్వ రికార్డుల ప్రకారం సుమారు 25.09 ఎకరాల స్థలాలు వేర్వేరుచోట్ల ఉన్నాయి. ఇందులో ఎంపీడీఓ ఆఫీసు వెనుక వైపు, మదనపల్లె రోడ్డు ప్రాంతం, ఆర్టీసీ డిపో వద్ద, అగర్‌బత్తీ కాలనీ సమీపం, సీఎస్ఐ ట్రస్టు వద్ద, గొబ్బిళ్ల కోటూరుకు ఉత్తరంవైపు, గడ్డూరుల వద్ద శ్మశానాలే కనిపించడం లేదు. ఆక్రమణలకు గురైన స్థలాల్లో ఇప్పటికే పక్కా భవనాలు వెలిశాయి. అసలు శ్మశాన స్థలాలుగా రెవెన్యూ రికార్డుల్లో మాత్రం నిక్షిప్తమైన ఈ సర్వే నెంబర్లపై రిజిస్ట్రరు కార్యాలయంలో ఎలా క్రయ విక్రయాలు రిజిస్ట్రేషన్లు జరిగాయో అక్కడి దస్తావేజు లేఖరులు, కార్యాలయ అధికారులకే తెలియాలి.

పల్లెల్లో మరీ అధ్వానం

పలమనేరు మండలంలో పది పంచాయితీలు వాటిల్లో 70 గ్రామాలున్నాయి. కానీ వీటిల్లో 56 గ్రామాలకు నేటికీ శ్మశానానికి స్థలాలు లేవు. దీంతో చెరువు, వంకలే వీరికి శ్మశానాలుగా మారాయి. ఇప్పటికే మండలంలోని గొల్లపల్లె, కల్లాడు, కొలమాసనపల్లె, జరావారిపల్లె, బయ్యప్పగారిపల్లెల్లో శ్మశాన స్థలాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జగమర్ల యానాదికాలనీ వాసులకు అడవులే శ్మశానాలు. కొన్ని గ్రామాల్లో ఈ సమస్యతో ఎప్పటికప్పుడు అంత్య క్రియలు జరక్క మృతదేహాలనుంచుకొని ధర్నాలు, రాస్తారోకోలు చేసిన సందర్భాలున్నాయి.

చర్యలు తీసుకోవాలి

రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్న శ్మశాన స్థలాలను గుర్తించి ఆక్రమణలను తొలగించేందుకు రెవెన్యూశాఖ చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌జేడీకి సత్కారం



ఆర్‌జేడీని సన్మానిస్తున్న చంద్రమోహన్‌రెడ్డి

పుంగనూరు: రాయలసీమ జిల్లాల విద్యాశాఖ ఆర్‌జేడీగా బాధ్యతలు స్వీకరించిన శ్యామ్యూల్‌ను పలువురు అభినందించారు. శుక్రవారం పట్టణంలోని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌జేడీని కలిసి సన్మానించి, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా పలు ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, పరిష్కరించాలని కోరారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆర్‌జేడీ హామీ ఇచ్చినట్లు తెలిపారు.